నమస్తే తెలంగాణ
ఆదిలాబాద్
5 | నిజామాబాద్, ఆదివారం 28 జనవరి 2024 | ADILABAD

గ్రంథాలయాల్లో పాఠకుల సంఖ్యను పెంచుకుందాం..

స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్

మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్

నిర్మల్ టౌన్, జనవరి 27 : నిర్మల్ జిల్లాలోని గ్రంథాలయాల్లో యువతకు విజ్ఞానాన్ని అందించడానికి అవసరమైన పుస్తకాల సరఫరా, మౌలిక సదుపాయలకు అనుగుణంగా బడ్జెట్ అంచనాలను తయారు చేయాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ పేర్కొన్నారు. శనివారం కలెక్టరేట్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. 2024-25 సంవత్సరానికిగాను గ్రంథాలయాల బడ్జెట్ పరిశీలన, ఆమోద కమిటీ, సమావేశం, లైబ్రరి, పుస్తకాలు, సెమినార్ల నిర్వహణ కోసం రూ.1.28 కోట్లతో బడ్జెట్‌ను ఆమోదం తెలిపామన్నారు. అన్ని గ్రంథాలయాల్లో మౌలిక సదుపాయాలను కల్పించడానికి కృషి చేయడం జరుగుతున్నదన్నారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయాల కార్యదర్శి లక్ష్మీరాజం, డీఎల్‌పీవో రమేశ్, డీపీఆర్‌వో తిరుమల పాల్గొన్నారు.

పథకాలు అందేలా చూడాలి..

మాట్లాడుతున్న ఐటీడీఏ పీవో ఖుష్బు గుప్తా

ఉట్నూర్, జనవరి 27 : ప్రభుత్వ సంక్షేమ పథకాలు గిరిజనులకు అందేలా చూడాలని ఐటీడీఏ పీవో ఖుష్బు గుప్తా అన్నారు. శనివారం స్థానిక పీవో క్యాంపు కార్యాలయంలో ఐటీడీఏ పరిధిలోని వివిధ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అభివృద్ధి, సంక్షేమ పథకాలను ఆదివాసులకు అందేలా చూడాలని అధికారులకు సూచించారు. విద్య, వైద్యం, మహిళా, శిశు సంక్షేమం, స్వయం ఉపాధి పథకాల మంజూరు వంటి అంశాలను ప్రతిష్టాత్మకంగా అమలు చేయాలన్నారు. ఈ సమావేశంలో అదనపు వైద్యాధికారి బాలు, జీసీసీ మేనేజర్ రామానందం, పీవో రాంబాబు, డీఈ శివకుమార్ పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌ను గెలిపించాలి..

- పార్లమెంట్‌లో మన గళం వినిపించాలంటే ఆవశ్యకం
- కేసీఆర్ అనే పదం లేని రాజకీయాలను ఊహించుకోలేం..
- బీజేపీ, కాంగ్రెస్ ఎన్ని కుట్రలు చేసినా బీఆర్ఎస్ వైపే ప్రజలు
- వచ్చే ఎన్నికల్లో అత్యధిక మెజారిటీతో గెలిపించాలి..
- ఎమ్మెల్సీ, గాయకుడు దేశపతి శ్రీనివాస్
- బోథ్‌లో బీఆర్ఎస్ నియోజకవర్గ స్థాయి సమావేశం

తెలంగాణ గీతాన్ని ఆలపిస్తున్న ఎమ్మెల్సీ, గాయకుడు దేశపతి శ్రీనివాస్

బోథ్, జనవరి 27 : పార్లమెంట్‌లో తెలంగాణ గళం వినిపించడానికి సార్వత్రిక ఎన్నికల్లో బీఆర్ఎస్‌ను గెలిపించాలని ఎమ్మెల్సీ, గాయకుడు దేశపతి శ్రీనివాస్ కోరారు. శనివారం ఆదిలాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ నాయకులు, కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశంలో భాగంగా బోథ్ నియోజకవర్గ స్థాయి సమావేశాన్ని మండల కేంద్రంలో నిర్వహించారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు జోగు రామన్న, ఎమ్మెల్సీ దండె విఠల్, బోథ్ ఎమ్మెల్యే జాదవ్ అనిల్, మాజీ ఎంపీ నగేశ్, మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు, ఖానాపూర్ బీఆర్ఎస్ నాయకుడు జాన్సన్ నాయక్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణలోని ఏడు మండలాలను ఆంధ్రలో కలిపినా రాజ్యసభలో కాంగ్రెస్ పార్టీ ఆనాడు అడ్డుకోలేదని గుర్తు చేశారు. మూడు దశాబ్దాలుగా తెలంగాణ రాజకీయాలు కేసీఆర్ చుట్టూ తిరిగాయని, కేసీఆర్ అనే పదం లేని రాజకీయాలను ప్రజలు ఊహించుకోవడం కష్టమన్నారు. ఇటీవల పీఎం నరేంద్రమోదీని సీఎం రేవంత్‌రెడ్డి కలిసిన అనంతరం బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు కలిసి బీఆర్ఎస్‌ను ఫినిష్ చేద్దామనే వార్తలు ఓ దినపత్రికలో వచ్చాయన్నారు. వారెన్ని కుట్రలు చేసినా తెలంగాణ ప్రజల నుంచి బీఆర్ఎస్‌ను దూరం చేయలేరన్నారు. బోథ్ నియోజకవర్గంలో అసెంబ్లీ ఎన్నికల ఫలితాల మాదిరిగానే పార్లమెంట్ ఎన్నికల్లో కూడా అభ్యర్థికి అధిక మెజారిటీ సాధించి పెట్టాలన్నారు.

నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలి..

అసెంబ్లీ ఎన్నికలకు దీటుగా పార్లమెంట్ ఎన్నికల్లో అభ్యర్థి గెలుపునకు నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు జోగు రామన్న పిలుపునిచ్చారు. పార్లమెంట్ ఎన్నికల్లో యువత ఓట్లే కీలకమని ఎమ్మెల్సీ దండె విఠల్ పేర్కొన్నాడు. గ్రామాల్లోని బూత్ స్థాయిలో కార్యకర్తలు కష్టపడి పార్టీ కోసం పని చేయాలని మాజీ ఎంపీ నగేశ్ పేర్కొన్నారు. ఉద్యమ స్ఫూర్తిని కొనసాగిస్తూ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ తారక రామారావుకు ఇచ్చిన మాట ప్రకారం అసెంబ్లీ ఎన్నికల కంటే అధిక మెజారిటీని బోథ్‌లో సాధించి పెట్టాలని ఎమ్మెల్యే అనిల్ జాదవ్ తెలిపారు. బీజేపీ, కాంగ్రెస్ పార్టీలను ప్రజలు నమ్మే స్థితిలో లేరని మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు పేర్కొన్నారు.

ఈ సమావేశంలో బోథ్, ఇచ్చోడ ఎంపీపీలు తుల శ్రీనివాస్, ప్రీతంరెడ్డి, జడ్పీటీసీలు సంధ్యారాణి, సుధాకర్, తాటిపెల్లి రాజు, పార్టీ కన్వీనర్లు డి నారాయణరెడ్డి, కృష్ణారెడ్డి, అరుణ్‌కుమార్, కాటిపెల్లి సునీతారెడ్డి, ఏఎంసీ చైర్మన్ రుక్మణ్‌సింగ్, స్థానిక సర్పంచ్ సురేందర్‌యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

పాల్గొన్న నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలు

కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ పార్టీ నిర్మల్ జిల్లా అధ్యక్షుడు విఠల్‌రెడ్డి

రైతుబంధుకే దిక్కులేదు.. గ్యారెంటీల అమలేలా..

- బీఆర్ఎస్ పార్టీ నిర్మల్ జిల్లా అధ్యక్షుడు విఠల్‌రెడ్డి
- కుభీర్‌లో మండల విస్తృతస్థాయి సమావేశం
- బీఆర్ఎస్‌ను టీఆర్ఎస్‌గా మార్చాలని తీర్మానం

కుభీర్, జనవరి 27 : ఎన్నికల సమయంలో డిసెంబర్ 9న రైతుబంధు డబ్బులు ఇస్తామని అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ నెలన్నర గడిచినా పూర్తిస్థాయిలో రైతుల ఖాతాల్లో డబ్బులు జమ చేయలేదని ముథోల్ మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు విఠల్ రెడ్డి మండిపడ్డారు. శనివారం కుభీర్ మండల కేంద్రంలో పార్లమెంటు ఎన్నికలు, ముథోల్ నియోజకవర్గంలో పార్టీ ఓటమిపై మండల స్థాయి బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. రైతుబంధుకే దిక్కులేదు.. ఇక ఆరు గ్యారెంటీల అమలు దేవుడెరుగు అని అన్నారు. మాయ మాటలు చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్లమెంటు ఎన్నికల్లో మూల్యం చెల్లించుకోకతప్పదని హెచ్చరించారు. గత శాసనసభ ఎన్నికల్లో ఓటమికి గల కారణాలను కార్యకర్తలు, నాయకులకు సమావేశంలో వివరించారు. ఏది ఏమైనా ఓటమితో కుంగిపోకుండా రెట్టింపు ఉత్సాహంతో పని చేయాలని సూచించారు. అంతకు ముందు కుభీర్ సర్పంచ్ విజయ్‌కుమార్ బీఆర్ఎస్‌ను టీఆర్ఎస్‌గా మార్చాలని తీర్మానం ప్రవేశ పెట్టగా.. అందురూ చప్పట్లతో సమర్థించారు. కిరణ్ కొమ్రెవార్, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు అనిల్, ఎంపీపీ లక్ష్మి, వైస్ ఎంపీపీ మొహియొద్దీన్, జడ్పీటీసీ సంజయ్ చౌహాన్, జిల్లా పార్టీ ప్రధాన కార్యదర్శి రాజేశ్వర్, మార్క్‌ఫెడ్ రాష్ట్ర డైరెక్టర్ గంగాచరన్, మాజీ జడ్పీటీసీ శంకర్ చౌహాన్, పార్టీ సోషల్ మీడియా మండల శాఖ ప్రతినిధి సంజీవ్ పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రామారావు పటేల్

అధికారులు సమన్వయంతో పనిచేయాలి..

- ఎమ్మెల్యే రామారావు పటేల్
- మండల సర్వసభ్య సమావేశానికి హాజరు

ముథోల్, జనవరి 27 : అధికారులు సమన్వయంతో పనిచేస్తూ సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ముథోల్ ఎమ్మెల్యే రామారావు పటేల్ అన్నారు. శనివారం ముథోల్ మండలాభివృద్ధి కార్యాలయంలో ఎంపీపీ అయేషా అఫ్రోజ్ ఖాన్ అధ్యక్షతన సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి ఎమ్మెల్యే హాజరై మాట్లాడారు. పెండింగ్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సర్పంచ్‌లు, అధికారులకు సూచించారు. అనంతరం మిషన్ భగీరథ ఏఈ మాట్లాడుతూ మిషన్ భగీరథ నీటిని అందిస్తున్నామని తెలుపగా.. ముథోల్ సర్పంచ్ రాజేందర్, ఎంపీటీసీ భూమేశ్‌లు నీటి సరఫరా సక్రమంగా లేదని ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. వారం, పది రోజుల్లోపు పైపు లికేజీల సమస్యలను పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. పంచాయతీరాజ్ ఏఈ ఉదయ్ మాట్లాడుతూ సీసీ రోడ్లు, డ్రైనేజీలను ఫిబ్రవరిలో పూర్తి చేసినట్లయితే మార్చిలో బిల్లులు వస్తాయని తెలిపారు. పలువురు సర్పంచ్‌లు ఆయా గ్రామాల్లో పోల్స్‌ను ఏర్పాటు చేయాలని విద్యుత్ శాఖ ఏఈ శ్రీకాంత్‌ను కోరారు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేలా చూస్తానన్నారు. జడ్పీఎస్ఎస్ స్కూళ్లు, టీచర్‌ల ఖాళీలను అందించాలని ఎంఈవోను ఎమ్మెల్యే ఆదేశించారు. అనంతరం ఆయా శాఖల తీరును అడిగి తెలుసుకుని సూచనలు, సలహాలు అందజేశారు. ఈ సమావేశంలో తహసీల్దార్ అతిఖొద్దీన్, సీడీపీవో శ్రీమతి, జడ్పీటీసీ సరోజినిరెడ్డి, ఎంపీడీవో సురేశ్ బాబు పాల్గొన్నారు.

దంపతుల ఆత్మహత్య

- గత మే నెలలో పెండ్లి
- సంక్రాంతి పండుగకు వెళ్లి తమ్ముడితో వచ్చిన పల్లవి
- తమ్ముడు ఇంటికి వెళ్లగానే పురుగుల మందుతాగి ఆత్మహత్య
- తనపై అపవాదు వస్తుందోననే భయంతో భర్త మృతి
- అనారోగ్యంతో పల్లవి చనిపోయిందని ఫిర్యాదు
- కొల్హారి గ్రామంలో విషాదఛాయలు

దంపతులు విజయ్, పల్లవి(ఫైల్)

గుడిహత్నూర్, జనవరి 27 : ఆదిలాబాద్ జిల్లాలోని గుడిహత్నూర్ మండలంలో గల కొల్హారి గ్రామానికి చెందిన దంపతులు పల్లవి(22), విజయ్(24) శుక్రవారం పురుగుల మందుతాగి ఆత్మహత్య చేసుకున్నారు. కొల్హారి గ్రామానికి చెందిన సేవాలే విజయ్‌తో మహారాష్ట్రలోని బోదడి తాలూకా గుల్జా గ్రామానికి చెందిన పల్లవితో గత మే నెలలో వివాహమైంది. సంక్రాంతి పండుగకు పుట్టింటికి వెళ్లిన ఆమె శుక్రవారం మధ్యాహ్నం తన తమ్ముడిని తీసుకుని అత్తారింటికి వచ్చింది. బావ బావమర్దులు ఇద్దరు కలిసి భోజనం చేశారు. ఆమె తమ్ముడు కృష్ణ తన ఇంటికి వెళ్లగా భర్త విజయ్ చేనుకు వెళ్లాడు. వీరిద్దరు వెళ్లి పోయాక ఇంట్లో పురుగుల మందు తాగి పల్లవి ఆత్మహత్యకు పాల్పడింది. కుటుంబ సభ్యులు పనులు ముగించుకుని సాయంత్రం ఇంటికి వచ్చే సరికి తలుపు గడియ పెట్టి ఉండడంతో ఇరుగుపొరుగు వారిని పిలిచి తలుపులు తీశారు. అప్పటికే ఆమె పురుగుల మందు తాగి అపస్మారక స్థితిలో పడి ఉంది. వెంటనే జిల్లా కేంద్రంలోని రిమ్స్ తీసుకెళ్లగా మృతి చెందింది. తన భార్య మృతి చెందడంతో తనపై అపవాదు వస్తుందోనన్న భయంతో విజయ్ జిల్లా కేంద్రంలోని తిర్పెల్లి కాలనీ శ్మశాన వాటికలో పురుగుల మందు తాగి బంధువులకు సమాచారం అందించాడు. ఈ విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు హుటాహుటిన అక్కడికి వెళ్లి ఆయనను ఆసుపత్రికి తీసుకెళ్లిన ప్రాణాలను కాపాడుకోలేకపోయారు. భార్యాభర్తలు ఇద్దరు మృతి చెందడంతో ఆ గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. తన కూతురు అనారోగ్యంతోనే అఘాయిత్యానికి పాల్పడిందని పల్లవి తండ్రి విష్ణు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సయ్యద్ ఇమ్రాన్ తెలిపారు.

పనులను వేగవంతం చేయాలి..

- రోడ్డు నిర్మాణానికి ప్రతిపాదనలు తయారు చేయండి..
- ఆదిలాబాద్ కలెక్టర్ రాహుల్‌రాజ్

ఇంద్రవెల్లి, జనవరి 27 : ఇంద్రవెల్లి మండలానికి సీఎం రేవంత్‌రెడ్డి రానున్న నేపథ్యంలో ఏర్పాట్లను వేగవంతం చేయాలని కలెక్టర్ రాహుల్‌రాజ్ అధికారులను ఆదేశించారు. శనివారం మూత్నూర్, కేస్లాపూర్‌లోని నాగోబా ఆలయంలోపాటు అమరవీరుల స్తూపం, ఐపీఎస్ స్కూల్ ప్రాంతాలను ఎస్పీ గౌస్ ఆలం, ఐటీడీఏ ఇన్‌చార్జి పీవో ఖుష్బు గుప్తాలతో కలిసి కలెక్టర్ ఏర్పాట్లను పరిశీలించారు. ముత్నూర్ నుంచి కేస్లాపూర్ వరకు రోడ్డు నిర్మాణానికి ప్రతిపాదనలను సిద్ధం చేయాలని ఇంజినీరింగ్ శాఖల అధికారులను ఆదేశించారు. నాగోబా ఆలయంలో చేపడుతున్న నిర్మాణ పనులను వెంటనే పూర్తి చేయాలని సూచించారు. అమరవీరుల స్తూపం వద్ద సభా ప్రాంగణం, హెలిప్యాడ్ గ్రౌండ్ కోసం అవసరమైన పనులు ప్రారంభించాలన్నారు. సీఎం పర్యటనలో భాగంగా పలు అభివృద్ధి పనులను ప్రారంభించనున్న నేపథ్యంలో అధికారులు ప్రతిపాదనలను సిద్ధం చేసి పంపాలని ఆదేశించారు. కొబ్బయిగూడలో ప్రభుత్వ భూమిని గుర్తించి రెవెన్యూశాఖ అధీనంలోకి తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌అండ్‌బీ ఈఈ నర్సయ్య, ఐటీడీఏ ఈఈ భీంరావ్, డీఎల్‌పీవో భిక్షపతిగౌడ్, తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్, ఎంపీడీవో పుష్పలత, డిప్యూటీ తహసీల్దార్ రమేశ్, ఆర్ఐ లక్ష్మణ్, ఎస్ఐ సునీల్, విద్యుత్ శాఖ ఏఈ రోహిదాస్, ఈవో సంజీవరావ్ పాల్గొన్నారు.

అమరవీరుల స్తూపం ప్రాంతంలో పర్యటిస్తున్న కలెక్టర్ రాహుల్‌రాజ్, ఎస్పీ గౌస్ ఆలం, ఐటీడీఏ ఇన్‌చార్జి పీవో ఖుష్బు గుప్తా

వైభవంగా కుల దేవతల ఉత్సవాలు

ఇంద్రవెల్లి, జనవరి 27 : పుష్యమాస అమవాస్యను పురస్కరించుకుని ఏజెన్సీలో ఆదివాసులు కుల దేవతలకు ఉత్సవాలను వైభవంగా నిర్వహిస్తున్నారు. పెర్సపేన్(పెద్ద దేవుడు) జంగుబాయి దేవత, భీమల్‌దేవుళ్లకు ఆదివాసులు భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు చేశారు. శనివారం రాజుగూడ గ్రామానికి చెందిన ఆదివాసులు జంగుబాయి దేవతను ఉట్నూర్ మండలంలోని కారిఏల్ మడుగుకు తరలించి పుణ్యస్నానం ఆచారించారు. ఆదివాసులు కుటుంబ సమేతంగా ఉత్సవాల్లో పాల్గొంటున్నారు. రాత్రి జంగుబాయి దేవతకు మహాపూజలు నిర్వహిస్తున్నట్లు కటోడ తోడసం బండు తెలిపారు.

సంప్రదాయ వాయిద్యాలతో వెళ్తున్న రాజుగూడ ఆదివాసులు

పెంబిలో కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే బొజ్జు

పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్
- శిలాఫలకం ఏర్పాటు చేయకపోవడంతో వెనుదిరిగిన ఎమ్మెల్యే
- అధికారుల తీరుపై ఆగ్రహం

పెంబి, జనవరి 27 : పేదల సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం కృషి చేస్తున్నదని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ పేర్కొన్నారు. శనివారం జంగన్‌గూడ, శెట్‌పల్లి గ్రామాల్లో అంగన్‌వాడీ కేంద్రాల ప్రారంభోత్సవానికి వచ్చిన ఆయన జంగన్ గూడలో శిలాఫలకం ఏర్పాటు చేయకపోవడంతో వెనుదిరిగారు. శెట్‌పల్లిలో అంగన్‌వాడీ కేంద్రం ప్రారంభోత్సవానికి అధికారులేవరు తమకు ఆహ్వానం అందించలేదని, శిలాఫలకం కూడా ఏర్పాటు చేయలేదని సర్పంచ్ రాధ ఎమ్మెల్యేకు విన్నవించారు. స్పందించిన ఎమ్మెల్యే సంబంధిత అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే శిలాఫలకం ఏర్పాటు చేయాలని ఆదేశించారు. సర్పంచ్‌కు తెలియకుండా అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడం సరికాదని హెచ్చరించారు. భవన నిర్మాణం చేపట్టిన సంబంధిత అధికారులు కార్యక్రమానికి హాజరుకాకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో 36 మంది లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మి, షాదీముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కబ్జాకు గురైన ప్రభుత్వ భూములపై సర్వే చేసి సంబంధికులపై తగు చర్యలు తీసుకోవాలని తహసీల్దార్‌ను ఆదేశించారు. మండల కేంద్రంలో సెంట్రల్ లైటింగ్, పబ్లిక్ టాయిలెట్స్ నిర్మాణానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సుధాకర్‌రెడ్డి, తహసీల్దార్ లక్ష్మణ్, ఎంపీవో రత్నాకర్‌రావు, సీడీపీవో సరిత, ఆ పార్టీ మండల అధ్యక్షుడు స్వప్నిల్‌రెడ్డి పాల్గొన్నారు.

వేతనాలిస్తరా.. ఇయ్యరా..?

- 27వ తేదీ వచ్చినా జీతం ఇవ్వకపోతే ఎలా బతకాలి..
- కుటుంబ సభ్యులను ఎలా పోషించుకోవాలి..
- కాంగ్రెస్ ప్రభుత్వం సమాధానం చెప్పి తీరాల్సిందే..
- అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ ఆధ్వర్యంలో ధర్నా
- అధికారులకు సమ్మె నోటీసు అందజేసిన కార్యకర్తలు

ఐసీడీఎస్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న అంగన్‌వాడీ టీచర్లు

ఎదులాపురం, జనవరి 27 : గత కేసీఆర్ ప్రభుత్వం జీతాలను సక్రమంగా చెల్లించిందని, నూతనంగా అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం 27వ తేదీ వచ్చినా వేతనాలు చెల్లించడం లేదని అంగన్‌వాడీ టీచర్లు ఆందోళన బాట పట్టారు. శనివారం ఆదిలాబాద్ జిల్లా సంక్షేమ శాఖ కార్యాలయం ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు సునీత మాట్లాడుతూ.. అంగన్‌వాడీ కార్యకర్తలకు వేతనాలు రాకపోవడంతో కుటుంబాలను ఎలా పోషించుకుంటారని, దీనికి కాంగ్రెస్ ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఫిబ్రవరి 16వ తేదీన దేశవ్యాప్తంగా నిర్వహించే కార్మిక సమ్మె గ్రామీణ బంద్‌లో అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లు పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు. ఇందుకోసం సమ్మె నోటీసు కూడా ఇచ్చామని పేర్కొన్నారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా, కార్మిక, రైతు, వ్యవసాయ కూలీ వ్యతిరేక విధానాలకు నిరసనగా ఆందోళన చేపడుతున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు బొజ్జ ఆశన్న, ఆ యూనియన్ అధ్యక్షురాలు వెంకటమ్మ, జిల్లా కోశాధికారి పి.రత్నమాల, ఉపాధ్యక్షుడు మధునిక, నాయకులు పాల్గొన్నారు.

- ఈనెల 31వ తేదీతో ముగియనున్న గడువు
- ఆదిలాబాద్ జిల్లాలో 1,91,889 రేషన్‌కార్డులు
- ఆధార్‌తో అప్‌డేట్ లేక ఇబ్బందులు

ఈ-కేవైసీ పూర్తయ్యేనా..!

ఆదిలాబాద్, జనవరి 27(నమస్తే తెలంగాణ) : ప్రజా పంపిణీ వ్యవస్థలో పారదర్శకత కోసం ప్రభుత్వం ఈ-కేవైసీ(నో యువర్ కస్టమర్) ప్రక్రియను ప్రవేశపెట్టింది. రేషన్ కార్డులో పేరున్న లబ్ధిదారులు రేషన్ దుకాణాలకు వెళ్లి ఈ-పాస్ యంత్రంలో తమ వేలి ముద్రలను ధ్రువీకరించుకోవాలి. జిల్లాలో ఈ-కేవైసీ నమోదు ప్రక్రియ ఐదు నెలలుగా కొనసాగుతున్నది. జిల్లా వ్యాప్తంగా 356 రేషన్ దుకాణాలు ఉండగా.. 1,91,772 రేషన్ కార్డులు ఉన్నాయి. ఇందులో 6,39,246 మంది లబ్ధిదారులు ఉండగా ప్రభుత్వం ప్రతి నెల 4,083 మెట్రిక్ టన్నుల బియ్యం పంపిణీ చేస్తున్నది. కేసీఆర్ ప్రభుత్వం ప్రతి కుటుంబంలో ఒక్కొక్కరికి ఆరు కిలోల చొప్పున ఫ్లోరిఫైడ్ బియ్యాన్ని సరఫరాను ప్రారంభించింది.

ఆధార్‌తో ఇబ్బందులు

రేషన్‌కార్డు లబ్ధిదారులు డీలర్ల వద్దకు వెళ్లి వేలి ముద్రలను ధ్రువీకరించుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. ఈ ప్రక్రియ ద్వారా బోగస్ కార్డుల ఏరివేతకు అవకాశం ఉంటుందని తెలుపుతున్నారు. సెప్టెంబర్‌లో ప్రారంభమైన ఈ-కేవేసీ నమోదు ప్రక్రియ ఈనెల 31వ తేదీతో ముగియనున్నది. లబ్ధిదారులు 6,39,246 మంది ఉండగా శుక్రవారం వరకు 4,75,198 మంది వేలి ముద్రలు ధ్రువీకరించుకున్నారు. ఆదిలాబాద్ జిల్లాలో 75 శాతం ప్రక్రియ పూర్తయింది. చాలా మంది లబ్ధిదారుల ఆధార్ కార్డు అప్‌డేట్ లేకపోవడం సమస్యగా మారింది. జిల్లాలో అరకొర ఆధార్ సెంటర్‌లు ఉండగా.. వీటిలో తమ కార్డుల అప్‌డేట్ కోసం బారులుదీరుతున్నారు. ఆధార్ కేంద్రాల నిర్వాహకులు టోకెన్ విధానం అంటూ వారం, పది రోజుల తర్వాత రమ్మంటున్నారు. దీంతో లబ్ధిదారుల ఈ-కేవైసీ ధ్రువీకరణ జరగడం లేదు. ఈ-కేవైసీ ప్రక్రియను వేగవంతం చేయడానికి అధికారులు చర్యలు తీసుకున్నారు. డీలర్లు ఇంటింటికీ వెళ్లి లబ్ధిదారుల వేలి ముద్రలు, ఐరిస్ తీసుకుంటున్నారు.

ఇంద్రవెల్లి మండలంలోని ముత్నూర్‌లో ఇంటికి వెళ్లి వృద్ధురాలి ఐస్ సేకరిస్తున్న డీలర్లు

వివరాలు సేకరిస్తున్నాం..

ఈ-కేవైసీ ప్రక్రియను ఈనెల 31వ తేదీతో ముగించాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఆదిలాబాద్ జిల్లాలో 75 శాతం ఈ-కేవైసీ పూర్తయింది. ఈ ప్రక్రియను వేగవంతం చేయడానికి పకడ్బందీ చర్యలు తీసుకున్నాం. కాలనీల్లో క్యాంపులు నిర్వహిస్తున్నాం. రాష్ట్రంలో మన జిల్లా ఐదో స్థానంలో ఉంది. ఆధార్ అప్‌డేట్ కాని వారి, ఉపాధి, చదువుల కోసం ఇతర ప్రాంతాల్లో ఉన్న వారి వివరాలను ప్రత్యేక రిజిస్టర్‌లో నమోదు చేస్తున్నాం.

- కిరణ్‌కుమార్, డీఎస్‌వో, ఆదిలాబాద్